ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

చిత్తూరు జిల్లా వార్తలు
శనివారం 17 మే 2025



సాయుధ దళాలకు సంఘీభావం

చిత్తూరు సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో ఉగ్రవాదులపై పోరాడుతున్న సాయుధ దళాలకు సంఘీభావం తెలుపుతూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరులో తిరంగా ర్యాలీ ఉత్సాహంగా సాగింది.గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎంఎస్ఆర్ సర్కిల్, పొన్నియమ్మన్ గుడివీధి, గాంధీరోడ్డు, కోర్టు మీదుగా గాంధీ విగ్రహ కూడలి వద్దకు చేరుకుంది.జాతీయ జెండాలు చేతపట్టుకుని నగర వీధుల్లో సాగిన ర్యాలీలో త్రివర్ణం రెపరెపలాడింది.బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు మాట్లాడుతూ దేశం కోసం వీర జవాన్లు చేస్తున్న త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భారత పౌరుడిపై వుందన్నారు.మన దేశంలోని 26మంది ఆడపడుచుల నుదుట సిందూరాన్ని తుడిచివేసిన పాకిస్తాన్ ఉగ్రవాదులకు చెందిన 9స్థావరాలను నేలమట్టం చేసిన భారత సాయుధ దళాలను చూసి మనమంతా గర్వపడాలన్నారు.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర చౌదరి,మేయర్ ఆముద,మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ,టీడీపీ నేతలు దొరబాబు,కటారి హేమలత, సురేంద్రకుమార్, యశ్వంత్, ఆరిఫ్, రవికుమార్, బాబు, మోహన్ నాయుడు, లోకేష్, కుమారస్వామి, సత్య, గోకుల్, శ్రీనివాస్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీకి సోమల మామిడి

సోమల, మే 16 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయల కొనుగోలుకు సోమలలోని మండీలు శ్రీకారం చుట్టాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన కాయలను న్యూఢిల్లీ, మహారాష్ట్ర, రాజస్తాన్, జైపూర్ ప్రాంతాలకు తరలించడానికి వ్యాపారులు సోమలకు చేరుకున్నారు. నిత్యం 10 లారీల మామిడి కాయలు పంపుతున్నారు. శుక్రవారం సోమల మార్కెట్‌లో పుల్లూర రకం కిలో రూ.22 నుంచి రూ.25, బేనిషా రకం రూ.28 నుంచి రూ.35, తోతాపురి రకం కిలో రూ.17 నుంచి రూ.20 పలికింది. నాణ్యతను బట్టి ధరలు నిర్ణయించారు.ఈ ఏడాది తోటల్లో దిగుబడులు తక్కువగానే ఉన్నా.. ధరలు ఆశాజనకంగానే ఉన్నట్లు రైతులు తెలిపారు. తోతాపురి రకం కొనుగోలులో పండ్ల పరిశ్రమలు సిండికేట్ కాకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సోమల మామిడి మార్కెట్‌కు చౌడేపల్లె, పుంగనూరు, కలికిరి, నిమ్మనపల్లె, సదుం మండలాల నుంచి కాయలు రావడంతో మండీలు సందడిగా మారాయి.


సోమల ప్రైవేటు మార్కెట్‌లో బేనిషా రకం కాయలు

16 మండలాల్లో వర్షం

చిత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఉదయం ఎనిమిది నుంచి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు 16 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఐరాలలో 37.2, అత్యల్పంగా తవణంపల్లెలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. పలమనేరులో 37, బంగారుపాళ్యంలో 33.6, పెద్దపంజాణిలో 22.4, బైరెడ్డిపల్లెలో 21.4, చౌడేపల్లెలో 19, పుంగనూరులో 16.2, గంగవరంలో 14.4, పులిచెర్లలో 13.2, వి.కోటలో 9.6, శాంతిపురంలో 8.2, పెనుమూరులో 7.4, వెదురుకుప్పంలో 6.2, రామకుప్పంలో 4.8, పూతలపట్టులో 2.2 మి.మీ వర్షం కురిసింది.

జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా వెంకటరెడ్డి

చిత్తూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా జైలులో అడిషినల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె.వెంకట రెడ్డిని చిత్తూరు జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా సబ్‌జైల్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి.. చిత్తూరు జిల్లా సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రూ.1.35 కోట్లతో కేజీబీవీల అభివృద్ధి

ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ


మధుసూదన్‌తో సమీక్షిస్తున్న వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీలను రూ.1.35 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు సమగ్ర శిక్ష (ఎస్ఎస్) ఏపీసీ వెంకటరమణ తెలిపారు. ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు (సివిల్ వర్క్స్)పై ఈఈ మధుసూదన్‌తో శుక్రవారం తన చాంబర్‌లో సమీక్షించారు. పరమసముద్రం, గుడుపల్లె, శాంతిపురం, పుంగనూరు, రొంపిచెర్లలోని కేజీబీవీలు టెన్త్ నుంచి ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ అయినట్లు తెలిపారు. ఒక్కో కేజీబీవీలో గ్రౌండ్, ఫస్టు ఫ్లోర్‌లో పడకగదులు, వాష్‌రూమ్స్ నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు.

పీఎంశ్రీ కింద ఇలా..

వీటితోపాటు పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) కింద విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడంలో భాగంగా ఒక్కో పాఠశాలలో రూ.4.25 లక్షల వ్యయంతో కనీసం ఐదు క్రీడలకు సంబంధించి ఐదు కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఎస్ ఏపీసీ తెలిపారు. జిల్లాలో వీటికోసం 40 బడులను ఎంపిక చేయగా, 29 ఉన్నత పాఠశాలల్లో క్రీడా కోర్టులు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పటి వరకు 19 పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తవగా, మిగిలిన పదిచోట్ల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పలమనేరులోని జగమర్లలో 950 మంది ఎస్టీ విద్యార్థులున్న క్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో ఈ ప్రాంతంలో స్కూల్, హాస్టల్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

19 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి: కలెక్టర్

చిత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 19 నుంచి 28వ తేదీవరకు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అలాగే ఈనెల 19 నుంచి 24వ తేదీవరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా జరుగుతాయన్నారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెన్త్ సప్లిమెంటరీకి 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 8,765 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్‌కు 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 670 మంది, ఇంటర్‌కు తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,182 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల డీబార్

చిత్తూరు సెంట్రల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలకు 426 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కుప్పం ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరిని డీబార్ చేసినట్లు డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్ ఇంటర్ జనరల్‌లో 5,539 మందికి 5,248 మంది, ఒకేషనల్‌లో 315 మందికి 275 మంది హాజరయ్యారు. సెకండియర్ జనరల్‌లో 1,430 మందికి 1,343 మంది, ఒకేషనల్‌లో 122 మందికి 114 మంది పరీక్షలు రాశారు. తనతోపాటు జిల్లా ప్రత్యేక అధికారి దయానందరాజు, కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, శరశ్చంద్రశేఖర్, ఫ్లయింగ్ స్క్వాడ్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు డీఐఈవో పేర్కొన్నారు.


దాసార్లపల్లె వద్ద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాల్వ పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

జూలైకి హంద్రీ-నీవా పనుల పూర్తి

- కుప్పానికి తాగు, సాగు నీరిస్తాం
- మంత్రి నిమ్మల రామానాయుడు

వి.కోట/కుప్పం/శాంతిపురం,మే 16(ఆంధ్రజ్యోతి): జూలై నాటికి హంద్రీ -నీవా సుజల స్రవంతి కాల్వ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వి.కోట మండలం దాసార్లపల్లె వద్ద జరుగుతున్న హెచ్ఎన్ఎస్ఎస్ రెండవ దశ కెనాల్ లైనింగ్ పనులను శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలసి మంత్రి పరిశీలించారు.లైనింగ్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సినిమా సెట్టింగుల తరహాలో ట్యాంకర్లలో నీరు పారించి కుప్పానికి నీరిచ్చామని ప్రజలను మభ్యపెట్టిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ళు తట్ట మట్టినా వేయకుండా, అరబస్తా సిమెంట్ పనులు చేయకుండా రూ.వందల కోట్లు దిగమింగారని ఆరోపించారు. హంద్రీ -నీవా పూర్తి చేశామని రాయలసీమ రైతులను మాటలతో మభ్యపెట్టారన్నారు.వెలుగోడు ప్రాజెక్టు పనులు పూర్తి చేశామంటూ జాతికి అంకితం చేశారని తీరా రూ. 5 వేల కోట్లు వెచ్చించి మరో మూడేళ్ళు కష్టపడ్డా పనులు పూర్తికాని పరిస్థితి నెలకొందన్నారు. పూర్తికాని పనులను తామే పూర్తిచేసినట్లు చెప్పుకున్న జగన్ చివరకు రాయలసీమ ద్రోహిగా నిలిచాడన్నారు. గత ప్రభుత్వంలో పెద్ద మంత్రిగా చెలామణి అయిన వ్యక్తి మట్టిదోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పూర్తి చేయడంపై పెట్టలేదన్నారు.విజిలెన్స్ విచారణ జరుగుతోందని, ఆయన దోచుకున్న అవినీతి సొమ్ము పూర్తిగా కక్కిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.వందల కోట్ల నిధులు వెచ్చించి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల పురోగతిపై 15 రోజులకోసారి సమీక్షిస్తూ త్వరిత గతిన పనులు పూర్తిచేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసి కుప్పానికి తాగు, సాగు నీరిస్తామన్నారు.


శాంతిపురం వద్ద పనుల పురోగతిని తెలుసుకుంటున్న మంత్రి

జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష

వి.కోట పర్యటనకు ముందు మంత్రి రామానాయుడు శాంతిపురం సమీపంలోని పాలారు నదిపై నిర్మించిన కల్వర్టులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీవో వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలించారు. హంద్రీ -నీవా కుప్పం బ్రాంచ్ కాల్వ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.ఈ కాల్వకు సంబంధించి మట్టి పనులు పూర్తయ్యాయని, కాంక్రీట్ లైనింగ్ పనులు వివిధ దశల్లో ఉన్నట్లు ఈఎస్సీ వెంకటేశ్వరావు, ఎస్ఈ విఠల్ ప్రసాద్ మంత్రికి వివరించారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీ.ఎస్.మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, ఆర్డీవోలు శ్రీనివాసులు, భవాని, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, టీడీపీ నేతలు రంగనాథ్, రాంబాబు, సుబ్బన్న, శబరీష్, రవిచంద్రబాబు, డా.సురేష్‌బాబు, విశ్వనాథనాయుడు, విజయ్ రామిరెడ్డి, సుగుణమ్మ,చంద్రశేఖర్, సుబ్రమణ్యం తదితరులతో పాటు జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.


స్వర్ణరథంపై విహరిస్తున్న వరసిద్ధుడు

స్వర్ణరథంపై వరసిద్ధుడి విహారం

కాణిపాకంలో వైభవంగా సంకటహార గణపతి వ్రతం


సంకటహరగణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శుక్రవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి స్వర్ణరథంపై విహరించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చారు. ఎదురుగా భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ఎగువమాసాపల్లెలో చదును చేసిన భూమి

పక్కా స్కెచ్‌తోనే భూకబ్జా!

- గువ్వకల్లు, ఎగువమాసాపల్లెకు చెందిన వ్యక్తులుగా గుర్తింపు
- గత ప్రభుత్వంలో 194 వెంకటాపురం వద్ద 15 ఎకరాల కబ్జాకు యత్నం
- ఇప్పుడు పార్టీ మారి గుట్ట పోరంబోకుపై కన్ను

చిత్తూరు రూరల్, మే16(ఆంధ్రజ్యోతి):పార్టీ మారినా గత వాసనలు పోలేదు...ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జాకు యత్నిస్తున్నారు.గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనుచరుడైన ఒకాయన మరో 24 మందితో కలిసి 20ఎకరాల ప్రభుత్వ భూ మేతకు స్కెచ్ వేశాడు.చిత్తూరు రూరల్ మండలం బండపల్లి రెవెన్యూ గ్రామం, ఎగువమాసాపల్లె సమీపంలోని సర్వే నెం. 188/1లో సుమారు 20 ఎకరాల అటవీశాఖ భూమి వుంది.దీనిపై వైసీపీ అధికారంలో వున్నప్పుడే కన్నేసిన అప్పటి ఎమ్మెల్యే అనుచరులు ఇప్పుడు పార్టీ కండువా మార్చి మరోసారి కబ్జాకు యత్నించారు. దీనిపై గ్రామస్తులు, టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం సాయంత్రం అటవీ శాఖ భూమిని చదును చేస్తున్న రెండు పొక్లైనర్లను, ఇద్దరు డ్రైవర్లను ఆ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గత ప్రభుత్వంలో కూడా వీరే 194 వెంకటాపురంలోని చెక్‌డ్యాం వద్ద 30 ఎకరాల మేత భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అప్పటి సర్వేయర్‌తో భూమికి సంబంధించిన స్కెచ్‌లు గీయించారు. స్కెచ్ ఆధారంగా చూపి భూ పంపిణీలో 10 మంది పేర్లను జాబితాలో చేర్చారు. బినామీ వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు.అధికారులు కూడా ఫైల్ పెట్టేందుకు సిద్ధమయ్యారు.ఈ సమాచారం తెలిసి 2023 వ సంవత్సరం నవంబరులో 'భూమేతకు స్కెచ్' పేరుతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురించడంతో అధికారులు స్పందించారు.దీంతో కబ్జా పర్వం ఆగిపోయింది.వారే కూటమి ప్రభుత్వం రాగానే పార్టీ మారిపోయారు.ఎగువమాసాపల్లె వద్ద 20 ఎకరాల కబ్జాకు యత్నించారు.ఇందుకోసం ముందుగా పీజీఆర్ఎస్‌లో 24 మంది పేర్లతో తమకు పలానా చోట ప్రభుత్వ భూమి ఉంది.పట్టాదారు పాసుపుస్తకం కావాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు.అనంతరం హైకోర్టులో పలానా సర్వే నెం.188/1లో 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. తమకు ఎటువంటి భూమీ లేదు కాబట్టి ఆ భూమికి పాసు పుస్తకాలు ఇప్పించాలని కేసు వేశారు.నిజానికి వీరిలో చాలా మందికి కోట్లాది రూపాయల విలువ చేసే భూములున్నాయి.గువ్వకల్లుకు చెందిన మరో నేతకు జీడీనెల్లూరులోని ఓ ప్రముఖ ఫ్యాక్టరీ వద్ద 150 ఎకరాల వరకు మామిడి తోపు ఉంది.ఎగువమాసాపల్లె వద్ద భూకబ్జాపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ, మండల సర్వేయర్ ఆ స్థలాన్ని పరిశీలించి అటవీ శాఖ భూమిగా తేల్చారు.అయితే పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణయత్నంపై వారు నోరు మెదపకపోవడం విమర్శలకు దారితీసింది.అటవీ శాఖ అధికారులు కూడా భూకబ్జాపై కేసు నమోదు చేయించకపోవడం అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

మామిడి రైతులను ఆదుకుంటాం

● గిట్టుబాటు ధరపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 16(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మామిడి పరిశ్రమ యాజమాన్యం, రైతు సంఘ నాయకులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలవారీగా వచ్చే మామిడి దిగుబడిని పరిశీలించి మద్దతు ధరకు చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత కోయడం వల్ల మార్కెట్‌లో లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. అటు రైతులు, ఇటు ఫ్యాక్టరీ యజమానులు నష్టపోకుండా స్థిరత్వం కలిగిన ధరలు నిర్ణయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకోవడం వల్ల తాము నష్టపోతున్నామని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మరోసారి ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి రైతులు, రైతు సంఘ నాయకులు, ఫ్యాక్టరీ యజమానులతో సమావేశమై చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు కరకంబాడి రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా వున్న సీవీ క్రికెట్ అకాడమీలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో రావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.72 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,208

తలనీలాలు సమర్పించినవారు: 32,951



● జిల్లాలో 1.25లక్షల మంది రక్తపోటు బాధితులు

● అనధికారికంగా మరో రెండు లక్షలు పైనే





నేడు ప్రపంచ బీపీ డే

బీపీ రేస్తోంది..!

ఆరోగ్యంలో అతి ముఖ్యమైన సమస్యగా బీపీ మారిపోయింది. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే బీపీ సమస్య మొదలయ్యేది. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేదు. ముఖ్యంగా యువత అధిక రక్తపోటుకు గురవడమే ఆందోళనపెడుతోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు ప్రధాన కారణమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.ప తిరుపతి జిల్లాలో 1,24,607 మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని వైద్య వర్గాల గణాంకాల్లో నమోదైంది. నిజానికి బీపీ చెక్ చేసుకోనివారే అత్యధికంగా ఉంటారు. ఇలా చేస్తే ఈ సంఖ్య భయపెట్టేంత ఉండచ్చని అంచనా. అయితే నియంత్రణలో ఉంచుకుంటే బీపీకి జంకాల్సిన అవసరమే ఉండదు. రక్తపోటు నుంచి ఎలా తప్పించుకోవాలో, ఒకవేళ వస్తే ఎలా అధిగమించాలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ అభిషేక్ కాషా 'ఆంధ్రజ్యోతి'కి ఇలా వివరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

140/90 మించితే..

సాధారణ రక్తపోటు 120/80 ఉంటుంది. ఇది నిరంతరం 140/90 మించి ఉంటేనే బీపీ ఉన్నట్టుగా భావించాలి. ఎప్పుడో ఒకసారి ఇలా కనిపిస్తే ఆందోళన అవసరం లేదు. ఒత్తిడి, శారీరక శ్రమ వంటి తాత్కాలిక కారణాల వలన హఠాత్తుగా అధిక రీడింగ్ రావచ్చు. అప్రతిరోజు సాధారణం కంటే ఎక్కువ చూపిస్తేనే అధిక రక్తపోటుగా నిర్ధారించుకోవాలి. గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వాటికి అధిక రక్తపోటు దారితీసే అవకాశం ఉంటుంది.

డాక్టర్ అభిషేక్ కాషా, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్, తిరుపతి.

ఇంట్లోనే చెక్ చేసుకోవచ్చు

బీపీ ఎంత ఉందో తెలుసుకుంటూ ఉండడం ముఖ్యం. ఇందుకోసం ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. చిన్న పరికరం ఇంట్లో ఉంచుకుంటే చాలు. ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే తప్పనిసరిగా బీపీ చెక్ చేసుకుంటూ ఉండాలి.

యువత సతమతం

ఇటీవల యువతలో కూడా అధిక రక్తపోటు ఎక్కువగా కనిపిస్తుంది. ఇది జీవనశైలిలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి వల్ల జరుగుతోంది. ఈ వయస్సులో రెండవ కారణాల్ని తప్పక పరిశీలించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామందికి బీపీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో లేదా ముందస్తు హెచ్చరిక సంకేతాలను ఎలా గుర్తించాలో పూర్తిగా తెలియదు. ఈ అవగాహన లేకపోవడం వల్ల బీపీని నియంత్రణలో పెట్టలేక పోతున్నారు. బీపీ నియంత్రణకు మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చాయి. జీవనశైలి మార్పులు తోడైతే ఫలితాలు మరింత మెరుగవుతాయి.

వేసవిలో ఇలా చేయండి..



బరువు నియంత్రణలో ఉంచుకోవాలి. తక్కువ ఉప్పు, తక్కువ కొవ్వు ఉన్న పదార్థాలే తీసుకోవాలి. మద్యం ఎక్కువైతే ప్రమాదమే. వ్యాయామం, ధ్యానం చాలా మంచి ఫలితాలను ఇస్తుంది. రక్తపోటును నివారించగల లేదా నియంత్రించగల ఆహారపు అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యం. వేసవిలో లభించే పండ్లు కూరగాయల్లో ఏవి బీపీ నియంత్రణకు సహకరిస్తాయో స్విమ్స్ డైటీషియన్ డాక్టర్ కందారపు గీత ఇలా వివరిస్తున్నారు...

డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్



పుచ్చకాయ: ఇది చాలా హైడ్రేటింగ్‌గా ఉంటుంది. ఇందులో ఎల్-సిట్రులైన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలోనూ, రక్తపోటును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ధమనుల పనితీరుకు మెరుగుపరుస్తుంది. దీనిలోని పొటాషియం కంటెంట్ శరీరంలో సోడియం ప్రభావాలను సమతుల్యం చేయడానికి కూడా సహాయపడుతుంది.



దోసకాయ: వేసవిలో రక్తపోటును నియంత్రించడంలో అద్భుతమైనది. కేలరీలు తక్కువగా ఉంటాయి. పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది రక్త నాళాలను సడలించడానికి, మూత్రం ద్వారా అదనపు సోడియంను విసర్జించడానికి సహాయపడుతుంది.



ఆకుకూరలు: వేసవిలో దొరికే చాలా రకాలైన ఆకు కూరల్లో నైట్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి, రక్త నాళాలను వెడల్పు చేసి, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.



కొబ్బరి నీళ్లు: వీటిలో పొటాషియం, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి ద్రవ సమతుల్యతను నియంత్రించడంలో రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి.



మామిడి పండ్లు: ఫైబర్, పొటాషియం, బీటా-కెరోటిన్ కూడా పుష్కలంగా ఉంటాయి, ఇవి అధిక రక్తపోటును నిర్వహించడంలో సహాయపడతాయి.



నిమ్మకాయ: విటమిన్ సి ఫ్లేవనాయిడ్లు బీపీ నియంత్రణకి ఎంతో ఉపయోగం.

వ్యాపారిని బురిడీ కొట్టించి...

● ఫోన్‌పే ద్వారా రూ.81వేల లూటీ ● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): చిల్లర దుకాణం వ్యాపారిని బురిడీ కొట్టించిన ఇద్దరు టక్కరి దొంగలు రూ.81వేలను స్వాహా చేశారు. బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ సరికొత్త సైబర్ క్రైం శ్రీకాళహస్తిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం గాంధీవీధికి చెందిన మునస్వామి తిప్ప ప్రాంతం ఆర్టీసీ రోడ్డులో ప్రొవిజన్‌షాప్‌ను నిర్వహిస్తుంటాడు. బుధవారం రాత్రి ఇద్దరు యువకులు సరుకులు కొనుగోలు కోసం మునస్వామి దుకాణానికి వచ్చారు. రూ.5వేలకు సరుకులు కొనుగోలు చేసిన తరువాత తమ వద్ద రూ.వెయ్యి నగదు మాత్రమే ఉందన్నారు. మిగతా రూ.4వేలను ఫోన్‌పే చేసేందుకు తమ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని నమ్మించారు. దుకాణదారుడి సెల్‌ఫోన్ నుంచి తమ నాన్నకు ఫోన్ చేసి మిగిలిన రూ.4వేలను ఫోన్‌పై ద్వారా జమ చేస్తామని నమ్మించారు. దీంతో మునస్వామి వారికి ఫోన్ ఇచ్చాడు. ఒక యువకుడు దుకాణదారుడిని మాటల్లో పెట్టాడు. మరో యువకుడు మునస్వామి సెల్‌ఫోన్‌లో ఫోన్‌పేను ఆపరేట్ చేసి తిరిగి అప్పగించాడు. ఆ తరువాత కొనుగోలు కోసం వచ్చిన యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తరువాత బ్యాంకు ఖాతా నుంచి రూ.81వేలు నగదు మాయమైనట్లుగా మునస్వామికి మెసెజ్ వచ్చింది. దాంతో ఒకసారిగా ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యాడు. సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు యువకులకు ఫోన్ ఇవ్వడం కారణంగా నగదు లూటీ అయినట్లు గుర్తించి బాధితుడు గురువారం శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదని బాధితుడు తెలిపాడు.

హత్యకేసుపై ఎస్పీ సీరియస్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని జరిగిన హత్య ఉదంతంపై తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజు సీరియస్‌గా స్పందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో గడచిన రెండు వారాల్లో మూడు అనుమానాస్పద మరణాలు, హత్య వెలుగుచూసిన విషయం తెలిసిందే. వరుసగా ఒంటరి వ్యక్తులు హతమవుతుండటంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 16న శుక్రవారం 'ఏం జరుగుతోంది' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ స్పందించారు. మొదట మూడు అనుమానాస్పద మరణాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఎందుకు ఆదిలోనే ప్రత్యేక దృష్టి సారించలేదని శ్రీకాళహస్తి పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఇక నాల్గో ఘటన ముక్కంటి ఆలయ సమీపంలోని శ్మశాన వాటికలో గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హతమార్చిన అంశంపై స్థానిక పోలీసులను లోతాగా ఆరా తీశారు. హత్య జరిగి మూడు రోజులు అయినప్పటికీ కనీసం హతమైన యువకుడు ఎవరు అన్న వివరాలను ఎందుకు గుర్తించలేకపోయారని నిలదీసినట్లు సమాచారం. మృతదేహానికి రక్తపు మరకలను కూడా మూడు రోజుల నుంచి ఎందుకు శుభ్రం చేయలేదని ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్థానిక పోలీసు అధికారులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి చేరుకుని మృతదేహం ముఖంపై ఉన్న రక్తాన్ని శుభ్రం చేయించారు. హత్య జరిగిన శ్మశానానికి చేరుకుని ఆనవాళ్ల సేకరణ చేపట్టారు. వేగవంతంగా హత్య కేసును ఛేదించాలని ఎస్పీ స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో రెండు బృందాలుగా పోలీసులు ఏర్పడి గాలింపు ముమ్మరం చేశారు.

ప్రభుత్వ భూమికి అడ్డదారిలో డీకేటీ పట్టా!

● అడంగల్‌లో నమోదు

● ఫ్రీ హోల్డ్ భూముల పునఃపరిశీలనతో వెలుగు చూసిన వైనం

పుత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. నందిమంగళం లెక్కదాఖలాల్లోని సర్వే నెం.6/2లో 3.76 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. 2003కు ముందు ప్రభుత్వ భూములకు పట్టా పొందిన లబ్ధిదారులకు సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్రీహోల్డ్ పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫ్రీహోల్డ్ ప్రక్రియలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు అందడంతో ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను పునఃపరిశీలించాలని రెవెన్యూ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ జాబితాను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు వాస్తవాలు వెలుగు చూశాయి.

ఏం జరిగిందంటే..

చిత్తూరు సంతపేటకు వెంకటపెరుమాళ్ భార్య సుబ్బలక్ష్మమ్మకు 1991లో డీకేటీ పట్టా (నెం.52/4/91) జారీ చేసినట్లు నకిలీ పత్రం రూపొందించినట్లు ఆరోపణలున్నాయి. చిత్తూరుకు చెందిన మహిళకు పుత్తూరులో భూమి కేటాయించడంపై విమర్శలున్నాయి. అయితే, భర్త మరణానంతరం సుబ్బలక్ష్మమ్మ పుత్తూరులోని రెండో కుమార్తె నాగరత్నమ్మ వద్దకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పటికే 65 ఏళ్ల వయసున్న ఆమె.. కుమారులు బాలసుబ్రమణ్యం, హరినాథశెట్టి, శ్రీనివాసులు శెట్టి, కుమార్తెలు విజయ, నాగరత్నమ్మ, లలితకు వివాహాలు చేశారు. ఈ వివరాలను తన కుమార్తె నాగరత్నమ్మ పేరిట 1991 మే 7న రాసిన వీలునామాలో పొందుపరిచారు. అసలు 65 ఏళ్ల వయస్సులో సుబ్బలక్ష్మమ్మకు డీకేటీ భూమి ఎందుకు ఇచ్చారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కాగా, 2016 జనవరి 14న సుబ్బలక్ష్మమ్మ మృతి చెందారు. ఆ తర్వాత నాగరత్నమ్మ 2018 జూన్ 26న తన భర్త కుప్పుస్వామి పేరిట రిజిస్టర్ వీలునామా రాశారు. ఆయన కుమారుల పేరిట రిజిస్టర్ చేశారు. పాసుపుస్తకం, ఆన్‌లైన్ అడంగళ్‌లో పేర్లు నమోదు వంటివి శరవేగంగా జరిగిపోయాయి. వీరి కుటుంబం వైసీపీలో కొనసాగుతుండటంతో తమ పరపతిని వినియోగించి ఎవరికీ అనుమానాలు తలెత్తకుండా ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చినట్లు విమర్శలున్నాయి. 3.76 ఎకరాలకు ఏడు అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఫ్రీ హోల్డ్ భూములను పునఃపరిశీలించే ఈ క్రమంలో ఈ విషయం వెలుగు చూసింది. రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. 40 ఏళ్లుగా తమ ఆధీనంలో భూమి ఉందంటూ, మామిడి, ఇతర పంటలు వేసినట్లు కుటుంబ సభ్యుడు నరసింహారావు చెబుతుండటం గమనార్హం.

అభ్యంతరకరంగా డీకేటీ జారీ

డీకేటా పట్టా జారీ అభ్యంతరకరంగా ఉంది. నిబంధనలకు అనుగుణంగా పట్టాదారు వివరాలు రిజిస్టర్‌లో నమోదు కాలేదు. ఇవేవి లేకున్నా ఫ్రీహోల్డ్ జాబితాలో నమోదైంది. ఈ వివరాలను ఆర్డీవో, జేసీకి నివేదించా.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు



యువకుడిని ఢీకొన్న టిప్పర్

● పరిస్థితి విషమం ● గ్రామస్తుల ఆగ్రహం ● టిప్పర్ల అడ్డగింత

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడిని గ్రావెల్ టిప్పర్ ఢీకొంది. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ సరఫరా చేసే వందలాది టిప్పర్లు ఆగిపోయాయి. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన యువకుడు అరుణ్‌తేజ గురువారం రాత్రి షైక్రో టవర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఒక టిప్పర్ వేగంగా వచ్చి అతడిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ యువకుడిని చూసి గ్రామస్తులంతా ఊనుగుంటపాళెం వద్ద సాగర మాల రోడ్డు పనులకు గ్రావెల్ తరలిస్తున్న సుమారు వందకు పైగా టిప్పర్లను అడ్డుకున్నారు. యువకుడిని ఢీకొట్టిన టిప్పర్ డ్రైవర్ ముందుకు రావాలని కోరారు. ఎవ్వరూ రాకపోవడంతో రోడ్డుపైనే సాయంత్రం వరకు టిప్పర్లను కదలనివ్వలేదు.



ఊనుగుంటపాళెం వద్ద టిప్పర్‌లను అడ్డుకుని ఉన్న గ్రామస్తులు

ఏఎంపురంలో మళ్లీ గ్రావెల్ తవ్వకాలు

సత్యవేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. ఇక్కడి ప్రైవేట్ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ తవ్వకాలకు ఐదేళ్ల కాలపరిమితికి అనుమతులు పొందిన కొందరు చెన్నైకు చెందిన మట్టి మాఫియా మళ్లీ జూలు విదిలిస్తోంది. అప్పటి అనుమతులను అడ్డం పెట్టుకుని గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. నాలుగేళ్లుగా అడ్డు అదుపులేకుండా సాగించిన గ్రావెల్ రవాణా ధాటికి సత్యవేడు- టీపీకోట రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రజలు ఇప్పటికీ కష్టాలు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పది నెలలుగా స్తబ్దుగా ఉన్న మట్టి మాఫియా మళ్లీ పేట్రేగుతోంది. నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా చెన్నైకు గ్రావెల్ తరలిస్తున్నారు. టిప్పర్లను రోడ్డుకిరువైపులా భారీగా నిలిపి వేయడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. మరో వైపు ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి సమీపంలోనే రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఈ అటవీ ప్రాంతంలో నెమళ్ళు, జింకలు తదితర వన్యప్రాణులు విరివిగా ఉన్నాయి. ఈ గ్రావెల్ తవ్వకాల పర్యావరణ, జీవవైవిధ్యానికి విఘాతం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.



ఏఎంపురంలో జరుగుతున్న గ్రావెల్ రవాణా

శ్రీవారి సేవలో జాస్తి చలమేశ్వర్

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి, 16వ ఆర్థిక సంఘం సభ్యుడు సౌమ్య కాంతి ఘోష్, తెలంగాణ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రముఖ సినీనటుడు కృష్ణ సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరి రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం ముందు జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్‌లు

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కేశవరం సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ శివకుమార్‌లకు శుక్రవారం ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పేదల పెన్షన్‌కు సంబంధించి రూ2.40లక్షలు, మరో రూ 50వేలను డీఆర్‌డీఏ కార్యాలయానికి చెల్లించకుండా స్వాహా చేశారని ఎంపీడీఓ తెలిపారు. దీనిపై రెండు రోజుల్లోగా నగదు చెల్లించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా వ్యవసాయ అసిస్టెంట్ శివకుమార్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వడదెబ్బకు మహిళా రైతు మృతి



వసంత నిర్మల (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీ పరిధిలోని రామలింగాపురం రాజులకండ్రిగకు చెందిన వసంత నిర్మల(39) వడదెబ్బకు గురై మృతి చెందారు. గురువారం ఎండలో పొలంలో పని చేసుకుంటూ అక్కడ వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం తొట్టంబేడు రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు వచ్చారు. వసంత పొలంతో పాటు ఐదుగురు రైతులకు చెందిన పొలాల్లో గతంలో బాట ఉండేదని అందుకు అధికారులు సర్వే చేసేందుకు అక్కడికి చేరుకున్నారు. దీనికి వసంత అభ్యంతరం చెప్పడంతో పాటూ వారితో వాగ్వాదానికి దిగింది. అనంతరం పొలం పనులు చేస్తూ తీవ్రమైన ఎండకు అస్వస్థతకు గురై పొలంలోనే మృతి చెందింది.

హరిత విప్లవానికి బ్లూ ప్రింట్

ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీపై ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు


నారా లోకేశ్‌ను అభినందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీ.. హరిత విప్లవానికి బ్లూ ప్రింట్ వంటిదని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. అనంతపురం జిల్లా బేతపల్లిలో రూ.22వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్‌కు శుక్రవారం మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రిని ఎంపీ కలిసి అభినందించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని.. రాయలసీమలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈ కాంప్లెక్స్ ఏర్పాటుతో రాయలసీమకు మహర్దశ పట్టనుందన్నారు. సీఎం నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో మంత్రి లోకేశ్.. రెన్యూ చైర్మన్ సుమంత్ సిన్హా మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ప్రాజెక్టు ఏపీకి వచ్చిందని తెలియజేశారు.

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో నేడు మొక్కలు నాటాలి: కలెక్టర్

చిత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ఈ అంశంపై శుక్రవారం డీపీవో సుధాకర్‌తో కలిసి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండల నుంచి రక్షణ పొందడంలో భాగంగా ఎంపీడీవోలు, కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు తమ కార్యాలయాల ఆవరణలో ఐదు నుంచి పది మొక్కలను నాటాలన్నారు. జిల్లావ్యాప్తంగా రెండువేల మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నెలఖారు వరకు కొనసాగించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని బస్టాండ్‌లు, రద్దీ, కూరగాయలు అమ్మే ప్రాంతాల్లో షామియానాలు, టెంట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విరివిగా చలివేంద్రాలను పెట్టాలన్నారు. ఎండల తీవ్రత కారణంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశాలిచ్చారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు


తలపడుతున్న కర్నూలు - అనంతపురం జట్ల బాలికలు

యాదమరి, మే 16 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని మోర్దానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. శుక్ర, శనివారాల్లో క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఉంటాయి. ఆదివారం సెమీస్, ఫైనల్స్‌తో పోటీలు ముగియనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

- **బాలికల విభాగంలో..** : చిత్తూరు, కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు మూడు మ్యాచ్‌ల చొప్పున గెలుపొందాయి.
- **బాలుర విభాగంలో..** : ఉమ్మడి చిత్తూరు జిల్లా రెండు మ్యాచ్‌ల్లో.. విశాఖ, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల జట్లు మూడు మ్యాచ్ చొప్పున విజయం సాధించాయి.

11 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

చిత్తూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 11 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతులు పొందిన వారిలో.. సి.రామన్ (వి.కోట చెక్‌పోస్టు), కె.ప్రభాకర్ (చీకలబైలు చెక్‌పోస్టు), బి.హిదాయతుల్లా (ఈఎస్ కంట్రోల్ రూమ్, తిరుపతి), ఎం.రమేష్ బాబు (ఏసీ డిస్ట్రిలరీస్), వి.లోకేష్ (రామసముద్రం చెక్‌పోస్టు), ఎస్.ఇస్మాయిల్ (పలమనేరు స్టేషన్), వై.వైకుంఠరావు (క్యాటిల్ ఫాం చెక్‌పోస్టు), సి.ప్రవీణ్ కుమార్ (ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్), ఎం.ఉమామహేశ్వర్ (పీలేరు స్టేషన్), కె.శ్రీనివాస్ (ఈఎస్‌టీఎఫ్ చిత్తూరు), కె.మధుసూదన్ రెడ్డి (మదనపల్లె స్టేషన్) ఉన్నారు. వీరిని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ యూనియన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

గాలివానకు రేకులషెడ్డు ధ్వంసం

- **ఒకరికి గాయాలు**


చెలగానిపల్లెలో ధ్వంసమైన రేకులషెడ్డు

బైరెడ్డిపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెలగానిపల్లె గ్రామంలో గురువారం రాత్రి కురిసిన గాలివానకు రైతు రమణారెడ్డి ఆవుల కోసం వేసిన రేకుల షెడ్డు ధ్వంసమైంది. అలాగే రేకులు ఎగిరిపడటంతో అదే గ్రామానికి చెందిన ప్రమీల అనే మహిళ గాయపడింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు పలు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని వాపోయారు.

టెన్షన్.. టెన్షన్

చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా మాక్ డ్రిల్


గుమికూడిన ప్రయాణికులు - డాగ్ స్క్వాడ్ తనిఖీలు.. సూట్‌కేస్ బాంబ్‌ను నిర్వీర్యం చేస్తున్న బాంబ్ స్క్వాడ్

చిత్తూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఎటుచూసినా టెన్షన్ వాతావరణం కనిపించింది. ఓవైపు గాయపడ్డవారు.. మరోవైపు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది.. సూట్‌కేసు బాంబును నిర్వీర్యం చేయడం.. డాగ్ స్క్వాడ్ తనిఖీలు ఇలా అక్కడి వాతావరణం కనిపించింది. దీన్ని చూసిన ప్రయాణికులకు, స్థానికులకు ఏం జరిగిందో కొంతసేపు అర్థం కాలేదు. తర్వాత మాక్ డ్రిల్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం పోలీస్, ఫైర్, వైద్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన మాక్‌డ్రిల్ యుద్ధ వాతావరణాన్ని తలపించింది. జనావాసాల్లో, బస్టాండ్‌లో ఉగ్రదాడి జరిగితే సమీపంలోని పౌరులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. బాధితులకు ఎలాంటి సాయం చేయాలో కళ్లకు కట్టినట్లు చూపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎంహెచ్‌వో సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఆర్టీసీ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సారె తీసుకొస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు - గంగమ్మకు సారె సమర్పించి పూజలు

పసుపు కుంకుమ సారె అందుకోవమ్మా..!

కుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రజల ముత్తైదువ గంగమ్మ ఉగ్రరూపం దాల్చినా ఆమెకు ఆత్మీయంగా పుట్టింటి సారె సమర్పించి జాతరకు ఆహ్వానించడం స్థానిక సంప్రదాయం. అందుకే ప్రసన్న తిరుపతి గంగమాంబకు పసుపు కుంకుమలతో కూడిన సారెను సమర్పించుకునే ఘట్టం శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు శుక్రవారం అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమలతో కూడిన సారె సమర్పించారు. వారివెంట పసుపు కుంకుమలతో కూడిన పళ్లేలతో మహిళలు ముందుకు సాగారు. ముందుగా గంగబావి వద్దకు వెళ్లి గంగ పూజ చేశారు. ఇక్కడ సారెను పూజించిన అనంతరం ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి గంగమ్మకు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కర్పూర నీరాజనాలు సమర్పించి ఆమె ఆశీర్వాదాలు పొందారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ కంచర్లతోపాటు సహ నాయకులు భక్తులకు స్వయంగా వడ్డించారు. ఆలయ ఉత్సవ కమిటీ ప్రథమ సభ్యుడు బీఎంకే .రవిచంద్రబాబు, ఇతర కమిటీ సభ్యులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

శేషవాహనంపై ముత్తుమారెమ్మ చిద్విలాసం



ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ముత్తుమారెమ్మ అమ్మవారికి శేష వాహన సేవ వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన ముత్తుమారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని శేష వాహనంపై అధిష్ఠింపజేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. చిద్విలాసులైన అమ్మవారు భక్తుల కర్పూర నీరాజనాలు స్వీకరించి చల్లని చూపులు ప్రసరించారు. శేష వాహన సేవ కనుల పండువగా జరిగింది.

నియోజకవర్గానికో పారిశ్రామికవాడ

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


వ్యవసాయ పాలిటెక్నిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్

చౌడేపల్లె, మే16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికో పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.చౌడేపల్లె మండలంలోని కాటిపేరి పంచాయతీలో రూ.2.7 కోట్లతో నిర్మించిన ఆచార్య రంగా వ్యవసాయ పాలిటెక్నిక్‌ను శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా అధునాతన సదుపాయాలతో పాలిటెక్నిక్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు.పుంగనూరులో గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూమిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే యువత అధిక ఆదాయం పొందవచ్చన్నారు.పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి,ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ సత్యనారాయణ, ఏడీఆర్ డాక్టర్ సుమతి, పుంగనూరు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఏవోలు బాలాజీనాయక్, జ్యోతి, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో లీలామాధవి, చౌడేపల్లె, పుంగనూరు టీడీపీ మండలాధ్యక్షులు రమేష్‌రెడ్డి, మాధవరెడ్డి. నాయకులు లక్ష్మణరాజు, ఉయ్యాల రమణ, గంగాధర రెడ్డి, హరిప్రసాద్, కార్తీక్, బాబునాయుడు, విజయభాస్కర రెడ్డి, గని, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గంటలో దర్శనం అని చెప్పి ఉచిత క్యూలో పంపారు

బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్‌పై భక్తుల ఫిర్యాదు


ట్రావెల్స్ ప్రతినిధులు ఇచ్చిన టికెట్లను చూపుతున్న బెంగుళూరు భక్తబృందం

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): ఒక ట్రావెల్స్ సంస్థ కేవలం గంటలోనే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కల్పిస్తామని చెప్పి తీసుకువచ్చి చివరకు ఉచిత దర్శనం క్యూలో పంపారని బెంగళూరుకు చెందిన భక్తబృందం ఆవేదన వ్యక్తం చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్ అనే సంస్థ బెంగళూరుకు నుంచి తిరుమలకు రానుపోను, టిఫిన్, భోజనం, వసతి వంటి సౌకర్యాల కల్పన కోసం ఒక్కొక్కరి నుంచి రూ.3,600 తీసుకుంది. బస్సులో 36 మంది భక్తులు శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. వీరికి ఉదయం టిఫిన్ పెట్టించి జీపుల ద్వారా తిరుమలకు తీసుకువచ్చారు. వీరిని కృష్ణతేజ సర్కిల్ వద్ద ఉచిత క్యూలైన్ దగ్గర వదిలిపెట్టారు. ట్రావెల్స్ ఇచ్చిన టికెట్‌లను అక్కడ విధుల్లో ఉన్న భద్రతాసిబ్బందికి భక్తులు చూపించగా ఇవి దర్శన టికెట్లు కాదని తేల్చిచెప్పారు. మీరు ఉచిత దర్శనం క్యూలైన్‌లోకి ప్రవేశిస్తే దాదాపు 10 గంటల తర్వాత దర్శనం అవుతుందని వివరించారు. దీంతో భక్తబృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. గంటలోనే దర్శనం చేయిస్తామని ఇలా మోసంచేశారని కొందరు విజిలెన్స్ వారికి ఫిర్యాదు చేశారు.కేసును తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే ట్రావెల్స్ టికెట్‌పై 'ఫ్రీ దర్శనం' అని మాత్రమే రాసి ఉండటం గమనార్హం. ట్రావెల్స్ ప్రతినిధి భాస్కర్ మాట్లాడుతూ.. తాము ఉచిత దర్శనమనే చెప్పామని, ఎలాంటి ప్రత్యేక దర్శన టికెట్లు ఇస్తామని చెప్పలేదని పేర్కొన్నారు.

బెయిలొచ్చిందా.. తిరిగొస్తే ఒట్టు!

- **తప్పించుకు తిరుగుతున్న 920 మంది గంజాయి బ్యాచ్**
- **నిందితుల్లో ఇతర రాష్ట్రాల వారే అధికం**
- **ప్రత్యేక బృందాలతో గాలింపు**



బెయిల్‌తో బయటకొచ్చే గంజాయి బ్యాచ్.. మళ్లీ కనిపించడం లేదు. కోర్టు విచారణకు రావడంలేదు. ఇలా ఉమ్మడి జిల్లాలో బెయిల్ పొందిన వారిలో ఇంకా 920 మంది తప్పించుకు తిరుగుతున్నారు. వీరికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నిందితుల్లో అత్యధికులు ఇతర రాష్ట్రాల వారే.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

గత ఐదు సంవత్సరాల్లో గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లారు. కొంత కాలం జైళ్లలో ఉండి.. బెయిల్‌పై బయటకు వస్తున్నారు. ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరు కావడంలేదు. దీనిపై విచారిస్తున్న న్యాయమూర్తులు నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తున్నారు. వారిలో చాలా మంది జాడ కూడా కనిపించడంలేదు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిని విచారించే సమయంలో మరికొందరు బయట వ్యక్తుల ప్రమేయమూ వెలుగు చూస్తోంది. పోలీసులు వారిపైనా కేసులు నమోదు చేస్తున్నారు. అరెస్టు చేయడానికి వెళ్తే పత్తా లేకుండా పోతున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1020 మంది గంజాయి నిందితులు తప్పించుకుని తిరుగుతుండగా.. ఏడాది కాలంలో దాదాపు 100 మందిని పట్టుకున్నారు. మిగిలిన 920 మంది కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు. ఇలా తప్పించుకుని తిరుగుతున్న వారిలో ఇతర రాష్ట్రాల వారు..ముఖ్యంగా తమిళనాడుకు చెందినవాళ్లు అధికంగా ఉన్నట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి.కోర్టు వాయిదాలకు హాజరు పరచాలని సమన్లు జారీ అవుతున్నా నిందితుల ఆచూకీ దొరకడంలేదు. దీంతో కేసుల పురోగతి ముందుకు సాగడంలేదు.

102 మందిపై గంజాయి షీట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 102 మంది స్మగ్లర్లపై గంజాయి షీట్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపింది. ఉమ్మడి జిల్లా పరిధిలో గత తొమ్మిది నెలల వ్యవధిలో దాదాపు పది వేల కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇందులో 310 మందికిపైగా అరెస్టు అయ్యారని సమాచారం. ఒకటి కంటే ఎక్కువసార్లు పట్టుబడుతున్న వారిపై గంజాయి షీట్లు తెరిచారు. మరో 20 కేసుల్లో నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వద్దు

- **రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**


కల్లూరులోని ఓ దుకాణంలో టీ తాగుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి - ఆసుపత్రి వైద్య సేవలపై ఆరా తీస్తున్న మంత్రి

కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సకాలంలో ప్రభుత్వ వైద్యసేవలు అందించాలని, వైద్యసేవల్లో ఎలాంటి అలసత్వం వద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలో ఓపీ వివరాలు, మందులు, ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు, 108, 104 వైద్య సేవలు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సౌకర్యాలపై డాక్టర్ జానకీరావును అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలున్నా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● సాధారణ వ్యక్తిగా టీ స్టాల్లో...

కల్లూరు ప్రభుత్వాస్పత్రి తనిఖీ కోసం చల్లా రామచంద్రారెడ్డితో కలిసి కల్లూరు నాలుగురోడ్ల కూడలికి చేరుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఓ టీ స్టాల్ వద్ద కారును ఆపి టీ తాగారు. అక్కడ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ కార్యకర్తలపై
తప్పుడు కేసులు ఎత్తేస్తాం

● వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

చౌడేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు ఎత్తేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడేపల్లెలో నూతన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ యువత వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. యువత ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. 56 ఎకరాల్లోని పాలిటెక్నిక్ కాలేజీతో పాటు మరికొన్ని అనుసంధాన వ్యవస్థల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. రైతులకు అవగాహన కల్పించి లాభసాటి వ్యవసాయంగా మార్చాలన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను, ఆస్పత్రులను గుర్తించి వాటిని పూర్తిచేసి అభివృద్ధి పథంలో జిల్లాను నడిపాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్న వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. అనంతరం పలువురు సమస్యలపై వినతులు అందించారు. అనంతరం పుంగనూరు-కుప్పం, పుంగనూరు-రొంపిచర్ల- తిరుపతి నూతన బస్ సర్వీసులను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఆర్టీసీ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్, చల్లా

కుప్పంలో విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్


మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శుక్రవారం విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ మాక్ డ్రిల్‌ను ఆర్డీవో శ్రీనివాసులురాజు, డీఎస్పీ పార్థసారథి, అగ్నిమాపకాధికారి ప్రవీణ్ కుమార్ పర్యవేక్షించారు. యుద్ధం, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తమకుతాము కాపాడుకునే పద్ధతులు, ఆయా డిపార్టుమెంట్లు కాపాడే విధానం వంటి వాటి గురించి ప్రయోగాత్మకంగా అప్పటికప్పుడు ఆయా పరిస్థితులు సృష్టించి వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో, డీఎస్పీలు మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యుద్ధ వాతావరణం అలుముకున్నప్పుడు సైతం ధైర్యంగా నిలబడి, తమనుతాము కాపాడుకోవడమే కాక, ఆపదలో ఉన్న తోటి వారిని కాపాడేందుకు సాయపడాలని సూచించారు. ప్రజలను విపత్తుల నుంచి రక్షించడానికి ప్రభుత్వ యంత్రాంగాలు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

సోమల, మే 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపాలని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సోమల మండలం ఇరికిపెంటలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఇటీవల చైర్మన్ తల్లి రాజమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు మంత్రిని కలిసి వినతులు అందించారు. చెన్నపట్నం చెరువు మరమ్మతులకు, కట్ట వెడల్పుకు నిధులు మంజూరు చేయాలని నీటి సంఘ అధ్యక్షుడు బోస్ వినతి పత్రం అందజేశారు. ఏఎంసీ మార్కెట్‌లో తాగునీటి సౌకర్యం కోసం ఓవర్ హెడ్ ట్యాంకు, రైతులకు మరుగుదొడ్లు నిర్మించాలని యార్డు చైర్మన్ శ్రీనివాసులు నాయుడు కోరారు. పలువురు మండల స్థాయి అధికారులు కలిసి మండల సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో పుంగనూరు టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు మోహన్‌నాయుడు, కోటీశ్వరరావు, పీఎం.చంద్రశేఖర్‌నాయుడు, పీవీ. శివశంకర్, చాణిక్య, మహేంద్రబాబు, సుబ్రహ్మణ్యం యాదవ్, సతీష్, మమత, లత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ


వల్లిగట్లలో ఎన్నికలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

సోమల, మే 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం వల్లిగట్లలో పార్టీ గ్రామ కమిటీ ఎన్నికలను కార్యకర్తలతో కలిసి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం వల్లిగట్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎస్. రామకృష్ణను, ప్రధాన కార్యదర్శిగా పి. చంద్రబాబును ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ వాటర్‌షెడ్ చైర్మన్ సుబ్బరాయుడు, కందూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు వి. శ్రీనివాసులు, రెడ్డిమోహన్, విశ్వనాథం, చలపతి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం


ర్యాలీలో పాల్గొన్న ఆంజనేయరెడ్డి తదితరులు

రామకుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహకాలు అందిస్తోందని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధి మిట్టపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన ర్యాలీ, ఖరీఫ్ వార్షిక ప్రణాళిక తయారీ గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించడమే కాకుండా మార్కెట్లో మంచి ధర లభిస్తుందన్నారు. గ్రామసభలో ఆదర్శ రైతులు రామిరెడ్డి, అంజనేయప్పలను సన్మానించారు. టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, యువనేత కేశవరెడ్డి, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి జయప్ప, ఐసీఆర్‌పీ స్వప్న పాల్గొన్నారు.

ప్రసన్న గంగమ్మ సేవలో మంత్రి



కుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం పాతపేటలో కొలువైన ప్రసన్న తిరుపతి గంగమాంబను శుక్రవారం రాత్రి రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, కడా పీవో వికాస్ మర్మత్‌తో కలిసి దర్శించుకున్నారు. కుప్పం టీడీపీ నేతలు, గంగమాంబ ఆలయ కమిటీ చైర్మన్ రవిబాబు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక సారెను అందించిన మంత్రిని అర్చకులు ఆశీర్వదించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీటీడీ సభ్యులు శాంతారాం, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సువర్ణరాజు తదితరులు

పుంగనూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దళిత, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అధికశాతం నిధులు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పుంగనూరులో నూతనంగా జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధిలో పేదలు వెనుకబడినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శేఖర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మునీంద్ర నాయక్, బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్, దళిత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ సేవలో మంత్రి


మంత్రి, కలెక్టర్‌లకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వాదం అనంతరం ఆలయ ఈవో ఏకాంబరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, తెలుగు యువత శ్రీరాం చిన్నబాబు, నాయకులు రమేష్‌రెడ్డి, లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ముగిసిన గంగ జాతర


గంగమ్మ శిరస్సును తరలిస్తున్న భక్తులు

పలమనేరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో గంగమ్మ జాతర శుక్రవారం గంగమ్మ జలధి ఉత్సవంతో ముగిసింది. శుక్రవారం ఉదయం గంగమ్మ గుడిలో భక్తుల దర్శనార్థం ఏర్పాటుచేసిన గంగమ్మ శిరస్సును బావిలో జలధి కార్యక్రమంతో జాతర ముగిసింది. గంగమ్మ శిరస్సు ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు సహకరించిన మున్సిపల్ కమిషనర్, పారిశుధ్య సిబ్బందికి ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీధర్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

బండకిందపల్లె టీడీపీ అధ్యక్షుడిగా మదనమోహన్‌రెడ్డి


గ్రామ కమిటీని సన్మానిస్తున్న ఉయ్యాల రమణ

రొంపిచెర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండకిందపల్లె గ్రామకమిటీ అధ్యక్షుడిగా ఊటుకూరి మదనమోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు, రొంపిచెర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా బారేషా ఎన్నికయ్యారు. వీరిని పార్టీ అధ్యక్షుడు రమణ శాలువతో సత్కరించారు. సర్పంచ్ హన్సర్, జావీద్, చంద్రారెడ్డి, రమణారెడ్డి, అమరనాథరెడ్డి, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం


ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న రమణారెడ్డి

పుంగనూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి హరిహర హనుమదేశ్వర అయ్యప్ప సాయిరాం ట్రస్ట్ చైర్మన్ ఎస్‌కె. రమణారెడ్డి శుక్రవారం రూ.60 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యుడు జెల్లి మనోహర్ మాట్లాడుతూ సన్మాతన ధర్మాన్ని కాపాడేందుకు ఆలయ నిర్మాణాలకు ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సదుం, మే 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి టీడీపీ శ్రేణులకు సూచించారు. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లెలో నూతన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవానికి వెళుతున్న ఆయనకు శుక్రవారం సదుంలోని టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. చల్లా రామచంద్రారెడ్డి, నాయకులు రెడ్డిప్రసాద్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కుమార్, జోగా మధుసూదన్ రెడ్డి, చంద్ర, కృష్ణయ్య, మౌలా, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గాంబ ఆలయంలో చండీ హోమం

చిత్తూరు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి వైశాఖమాస మహాచండీ హోమాన్ని ఈవో మునిశేఖర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీడీ గోపి, ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్లు వీకే విశ్వనాథ్, డి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దుర్గాంబకు క్షీర, జలాభిషేకాలు చేశారు. సాయంత్రం గిరింపేట గొడుగుమూరు వాసులు దేవరాజుల రెడ్డి, మహేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి పుసుపు, కుంకుమ అలంకారం నిర్వహించారు. ఆలయ సిబ్బంది గోపి, పంబల్ మణి, గోపీనాథ్, దాము, వసంతమ్మ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), మే 16(ఆంధ్రజ్యోతి): పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి శుక్రవారం కాణిపాకం వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే డెంగ్యూ దూరం


పలమనేరులో ర్యాలీ

చౌడేపల్లె, మే16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే డెంగ్యూ బారి నుంచి బయట పడొచ్చని తహసీల్దార్ హనుమంతు, డాక్టర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

● రొంపిచెర్ల: దోమకాటుతో డెంగ్యూ బారిన పడుతారని వైద్యాధికారి వినయ్ అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల పట్టణంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, రెడ్డెప్ప, హెచ్‌ఈ రాజేశ్వరి పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరులోని పాతపేట అర్బన్ ఆరోగ్యకేంద్రం సిబ్బంది సబ్ యూనిట్ అధికారి జయశంకర్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాతపేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది సుజాత, జయంతి, కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● రామకుప్పం: ప్రతి ఒక్కరూ దోమల నిర్మూలన చర్యలు చేపడితేనే డెంగ్యూ నుంచి రక్షింపబడతారని రామకుప్పం మండలం విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పూజిత తెలిపారు. శుక్రవారం విజలాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● సదుం: చిన్నపాటి జాగ్రత్తలతో డెంగ్యూ నియంత్రణ సాధ్యమని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.గిరీషా పేర్కొన్నారు. శుక్రవారం చెరుకువారిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా బాలసుబ్రహ్మణ్యం




పుంగనూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా బాలసుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ శివ తెలిపారు. శుక్రవారం జరిగిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడిగా కె.బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా ఇనాయితుల్లా షరీఫ్, సుధాకర్‌రావు, కార్యదర్శిగా రఘుపతిరెడ్డి, సహాయ కార్యదర్శిగా మహిపాల్ రెడ్డి, కోశాధికారిగా కేశవరెడ్డి, సభ్యులుగా అమరావతి సురేశ్, క్లబ్ సర్వీసు చైర్మన్‌గా గోపాల్‌కృష్ణ, ఎల్‌సీఐఎఫ్ చైర్మన్ త్రిమూర్తిరెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ రజిఅహ్మద్, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్‌గా పీఎల్. శ్రీధర్, డైరెక్టర్లుగా డాక్టర్ శివ, డాక్టర్ సరళ, జి.వరదారెడ్డి, ఎన్. ముత్యాలు, మహేంద్రర్‌రావు, ఎం.సరస్వతి, టి.శ్రీరాములు, డాక్టర్లు రాధాకృష్ణ, రెడ్డికార్తీక్, రాంబాబు, రవికిషోర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కమనీయం.. రాములోరి కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లిలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం కమనీయంగా కల్యాణోత్సవ వేడుకలు నిర్వ హించారు. సాయంత్రం స్వామివారి ఊంజల్‌సేవ, పుష్పయాగం నిర్వహించిన అనంతరం కల్యాణోత్సవం వేడుకలు చేపట్టారు. రాత్రి పురవీధుల్లో సీతారాములు పుష్ప పల్లకిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు


రోగులతో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్

పలమనేరు, మే16 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన పలమనేరు వందపడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులను కలిసి ఆయన ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకొన్నారు. ఓపీకి హాజరవుతున్న డాక్టర్లు, రోగుల సంఖ్యపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకుని రోగులకు వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, పలమనేరు ఏఎంసీ మాజీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ చెంగారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె- పలమనేరు మార్గంలోని దాదేపల్లె సమీపంలో రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రానికి చెందిన రెడ్డెప్ప కుమారుడు నాగరాజ (56) గ్రామానికి పక్కనే ఉన్న దాదేపల్లెకి వెళ్లి తిరిగి స్వగ్రామానికి నడిచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కూలీలకు స్థానికంగానే ఉపాధి పనులు

సోమల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కూలీలందరికీ స్థానికంగానే ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఎంపీడీవో నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన సోమల, నెల్లిమందలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో షౌఖత్, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలి

సోమల , మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై క్షేత్రసిబ్బంది అవగాహన కల్పించాలని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు. శుక్రవారం స్థానిక వైద్యశాలలో సిబ్బందితో సమావేశమై సూచనలు చేశారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

రామకుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల, రామకుప్పం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు

పలమనేరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పోలీసు స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు విధినిర్వహణకు సంబంధించి గొడవపడటంతో వారిని వీఆర్‌కు బదిలీ చేశారు. పలమనేరు పోలీసుస్టేషన్‌లో శ్రీనివాసులు, ఉమామహేశ్వరి అనే కానిస్టేబుళ్లు రెండురోజుల క్రితం విధి నిర్వహణలో గొడవపడ్డారు. దీంతో సీఐ నరసింహులు వారిని చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేయించారు.

చెరువు పనుల్లో నాణ్యత లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూరు చెరువు కట్ట, పంట కాలువ పనుల్లో నాణ్యత లేదని వనమలదిన్నెకు చెందిన టీడీపీ నాయకులు పెద్దమోహన్‌నాయుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాయకులు తూతూమంత్రంగా పనులు చేయించి బిల్లులు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులను పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మే 16 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ



చిత్తూరు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబకు శుక్రవారం వైశాఖమాస పుష్పపల్లకీ సేవను ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారికి స్థానికులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కోలాటాలు, చెక్క భజనలు, విచిత్ర వేషధారణలు, నృత్యాలు భక్తులను అలరించాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం: కమిషనర్

చిత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ దినాన్ని పురస్కరించుకుని శాంతినగర్‌కాలనీలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొందాం

● ఆర్డీవో భవానీ శంకరి, డీఎస్పీ అజీజ్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో భవానీ శంకరి, వేదికపై డీఎస్పీ అజీజ్

నగరి, మే 16 (ఆంధ్రజ్యోతి): విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొందామని ఆర్డీవో భవానీ శంకరి, డీఎస్పీ అజీజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణ ప్రజలకు విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఏదైనా విపత్తు సంభవిస్తే 100 లేదా 92814 48313, 85772 36122, 83339 05022 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రవికుమార్, విద్యుత్ ఏడీ వెంకటముని, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజా దర్బార్'కు 24 అర్జీలు


అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, వేదికపై మేయర్ అముద

చిత్తూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజాదర్బార్‌కు 24 అర్జీలు అందాయి. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అర్జీలను మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ స్వీకరించారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, గుడిపాల తహసీల్దార్ జయంతి, ఎంఈఈ వెంకటరామిరెడ్డి, రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పపల్లకీ సేవ



చిత్తూరు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబకు శుక్రవారం వైశాఖమాస పుష్ప పల్లకీ సేవను ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పుర వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారికి స్థానికులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కోలాటాలు, చెక్క భజనలు, విచిత్ర వేషధారణలు, నృత్యాలు భక్తులను అలరించాయి.

నర్సుపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

ఐరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన నర్సు శకుంతలపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి తన విధుల్లో భాగంగా ఆస్పత్రిలో నర్సు శకుంతల ఓ రోగికి చికిత్స చేస్తున్నారు. ఆమెకు తోడుగా ఆమె భర్త కూడా అక్కడే ఉన్నాడు. ఆ సమయంలో ఐలవారిపల్లెకు చెందిన నవీన్ తన స్నేహితులతో ఆస్పత్రికి వచ్చాడు. తమకు చికిత్స చేయాలని కోరాడు. అయితే ముందున్న రోగికి చికిత్స చేయాలని నర్సు చెప్పడంతో కోపోద్రిక్తుడైన నవీన్ తన స్నేహితులతో కలిసి దాడి చేశాడు. నర్సును, ఆమె భర్తను చితకబాదారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చేసరికి నిందితులు పరారయ్యారు. ఈ సంఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధితురాలిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు ఆయన గురువారం పేర్కొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి


రామచంద్రయ్య (ఫైల్ ఫొటో)

చిత్తూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): మిట్టూరుకు చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, టీడీపీ సీనియర్ నేత ఎస్.రామచంద్రయ్య శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన 38వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈయన మృతిపై పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి.

దళితుల ఇళ్లపై రాజకీయ కుట్ర: కాంగ్రెస్

చిత్తూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): దళితుల ఇళ్లపై రాజకీయ కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పరదేశి ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఐరాల మండలం కాణిపాకం సమీపంలోని అగరంపల్లెలో దళితుల ఇళ్లను కూల్చడానికి అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. 43 ఏళ్లుగా జీవిస్తున్న దళితుల ఇళ్లను ఖాళీ చేయడానికి రాజకీయంగా కుట్రజరుగుతోందని చెప్పారు. గ్రామకంఠం భూమిలో ఇళ్లు ఉంటే, దాన్ని చెరువు కుంటగా చూపించడం అన్యాయమని వాపోయారు. కలెక్టర్ స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

బీజేపీ నేతల దృష్టికి విద్యాశాఖ సమస్యలు: ఆపస్


పురందేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న బాలాజి

చిత్తూరు సెంట్రల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను బీజేపీ నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సంఘటన కార్యదర్శి శ్రావణ్ కుమార్‌తో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ మధుకర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. హైస్కూల్ ప్లస్‌లు కొనసాగిస్తూ, ఖాళీగా ఉన్న పీజీటీ స్థానాల్లో ఎస్ఏలను నియమించాలని కోరారు. రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు కృషి చేయాలని విన్నవించారు. ఈ అంశాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు బాలాజి తెలిపారు.

యువరాజుకు పలువురి శుభాకాంక్షలు

పూతలపట్టు, మే 16 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యువరాజులు నాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. రాత్రి పూతలపట్టులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద భారీ కేక్ కట్‌చేసి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ నాయకులు ఎన్‌పీఎస్ జయప్రకాష్ నాయుడు, ఎన్‌పీఎస్ ధరణి, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, పూతలపట్టు టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, చంద్రబాబు, చిరంజీవి, గణపతి నాయుడు, సి.కె.చిట్టి, హిమకర్ నాయుడు, పంటపల్లి సురేంద్ర, కొత్తూరు బాబు నాయుడు, ఏకాంబరం, ప్రమోద్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకి, యువరాజులుకు సన్మానం

గంగజాతర హుండీ ఆదాయం రూ.3.56 లక్షలు

చిత్తూరు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నడివీధి గంగజాతర సందర్భంగా భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా రూ.3,56,830 కానుకలు సమర్పించారని నిర్వాహకులు సీకే లావణ్య, హేమంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం పొన్నియమ్మ గుడిలో దేవదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు. ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్, గుణశేర్, వేమారెడ్డి, అర్చకులు కేదారేశ్వరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, దేవదాయశాఖ సిబ్బంది చెంగల్‌రాయలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణోత్సవం



శ్రీరంగరాజపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): మహాభారతం ఉత్సవాల్లో భాగంగా 49.కొత్తపల్లెలో ద్రౌపది కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా సంజి వంశీయులు సుబ్రహ్మణ్యంరెడ్డి, సంపూర్ణమ్మ, పురుషోత్తం, లక్ష్మి వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త నాగరాజు, సురేష్‌బాబు, సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?

వెదురుకుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రూ.45 లక్షలతో కార్వేటినగరం మండలం డీఎంపురంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేపట్టారు. పనులు మాత్రం ఇంకా పూర్తికాలేదు. గ్రామ సచివాలయానికి సొంత భవన వసతి కలగా మారింది. ఇంకెంత కాలానికి ఈ భవన నిర్మాణం పూర్తి చేస్తారో తెలియడం లేదు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు రాకనే అసంపూర్తిగా ఆగినట్లు సమాచారం. సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కార్వేటినగరం మండలం డీఎంపురంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణం

విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు / విజయపురం మండల మీట్‌లో సభ్యుల ఆరోపణ

విజయపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆలపాకం, పన్నూరు, పన్నూరు సబ్‌స్టేషన్, ఇళ్లత్తూరు, మహారాజపురం ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆరోపించారు. విజయపురంలో ఎంపీపీ జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గంజాయి అందుబాటులో ఉండటంతో యువత మత్తులో జోగుతోందన్నారు. దీన్ని అడ్డుకునే చర్యలు నామమాత్రంగా ఉన్నాయని వాపోయారు. ఉపాధి హామీ పథకంలో జరిగే పనుల్లో క్షేత్రసహాయకుడు చేతివాటం చూపుతున్నారని పన్నూరు దళితవాడ సర్పంచ్ కుమార్ ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ఏ పని జరుగుతుందో కూడా సర్పంచ్‌లకు తెలియడం లేదని, అధికారులు ఏకపక్షంగా పనిచేస్తున్నారని ఎంపీటీసీ రాజగోపాల్ అన్నారు. ఆలపాకాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సదాశివం కోరారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మంజుబాలాజి, కన్నెమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంద్ర, వైద్యాధికారి విష్ణుప్రియ, పశువైద్యాధికారి శివకుమార్, ఏవో రజనీకుమారి, పీఆర్ ఏఈఈ వీరభద్రం, హౌసింగ్ ఏఈ ఏకుమళై, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంద్ర

పూతలపట్టు టీడీపీ అధ్యక్షుడిగా దొరబాబు



పూతలపట్టు, మే 16 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల టీడీపీ అధ్యక్షుడిగా దొరబాబు చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మురళీమోహన్, నియోజకవర్గ అబ్జర్వర్ శ్రీధర్, టీఎన్‌టీయూసీ రాష్ట్రనేత యువరాజులు నాయుడు, అధికార ప్రతినిధి గంగారపు గోపి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. పేటఅగ్రహారం గ్రామానికి చెందిన దొరబాబు 2002 నుంచి 2007 వరకు గ్రామకమిటీ అధ్యక్షుడిగా, 2007 నుంచి 2017 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా, 2017 నుంచి ఇప్పటివరకు మండల అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. పార్టీకి ఈయన చేసిన సేవలను గుర్తించి మరలా ఆయన్నే మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.కాగా దొరబాబు చౌదరికి పదవి వస్తుందని తెలుసుకున్న అనుచరులు రంగంపేట క్రాస్ రోడ్డు నుంచి పార్టీ కార్యాలయం వరకు వందలాది వాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. పార్టీ మాజీ కన్వీనర్లు ప్రతాపనేని చంద్రమౌళి, రామచంద్ర నాయుడు, నాయకులు బాలకృష్ణమ నాయుడు, ఇంద్రసేన నాయుడు, కార్తికేయ చౌదరి, చిరంజీవి, హిమకర్, ప్రమోద్, గురుస్వామి, నేతాజి, గణపతి నాయుడు, సి.కె. చిట్టి, రామానాయుడు పాల్గొన్నారు.

ఐరాలకు హరిబాబునాయుడు



ఐరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడిగా గంగారపు హరిబాబు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. హరిబాబునాయుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీని బలోపేతం చేస్తానని చెప్పారు. త్వరలోనే ప్రతి కార్యకర్తను కలుస్తానన్నారు.

పాలసముద్రం టీడీపీ అధ్యక్ష పదవికి పోటీ

పాలసముద్రం, మే 16 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండల టీడీపీ అధ్యక్ష పదవికి పలువురు నాయకులు పోటీపడుతున్నారు. ప్రస్తుతం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సి.రాజేంద్రన్ మండల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి వాసునాయుడు, తాళ్లూరు శివానాయుడు, ఎస్‌కేఆర్‌పురం మాజీ ఎంపీటీసీ బాబునాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజులు ఓసీ సామాజిక వర్గం నుంచి పదవిని ఆశిస్తున్నారు. అలాగే ఎస్సీ సామాజిక వర్గం నుంచి అరుళ్‌నాథన్, సాంబశివన్ బరిలో ఉన్నారు. వీరంతా ఇప్పటికే ఎమ్మెల్యే థామస్‌కు తమ కోరికను తెలియజేసినట్లు సమాచారం. ప్రధానంగా వాసునాయుడు, తాళ్లూరు శివానాయుడు మధ్యే ప్రధాన పోటీ నెలకొందన్న చర్చ జరుగుతోంది. చివరకు ఈ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

నింద్ర గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడిగా భాస్కర్


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న భాస్కర్

నింద్ర, మే 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నింద్ర గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నింద్రలో ఎన్నిక జరిగింది. అలాగే ఏజే రవికుమార్(కైపాకం), సుధాకర్(ఆరూరు) కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయకులు విజయ్‌కుమార్, గాలి రమేష్ నాయుడు, గిరిబాబు, పురుషోత్తం నాయుడు, లోకేష్, పెరుమాల్ రెడ్డి, బలరాం రెడ్డి, తంగవేలు, సంపూర్ణమ్మ, పరదేశి, శరవణ, ఏజీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

పెనుమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): బాలికలు రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధికారి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పెనుమూరు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న కిశోరి వికాసంపై జరుగుతున్న శిక్షణ తరగతుల్లో ప్రసంగించారు. అలాగే రామకృష్ణాపురం పంచాయతీ బి.అగ్రహారంలోనూ ఈ కార్యక్రమం జరిగింది. అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, సెక్రటరీ సునీత, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

పెనుమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కేసీపల్లె సచివాలయాన్ని ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది కొందరు సర్వే పేరుతో కొందరు బయోమెట్రిక్ వేసి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులున్నాయని చెప్పారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డితో కలిసి సంపద తయారీ కేంద్రాలను, హౌసింగ్ కాలనీలను పరిశీలించారు. సెక్రటరీ నిర్మలాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాంబ ఆలయంలో చండీ హోమం



చిత్తూరు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి వైశాఖమాస మహాచండీ హోమాన్ని ఈవో మునిశేఖర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీడీ గోపి, ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్లు వీకే విశ్వనాథ్, డి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దుర్గాంబకు క్షీర, జలాభిషేకాలు చేశారు. సాయంత్రం గిరింపేట గొడుగుమూరు వాసులు దేవరాజుల రెడ్డి, మహేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి పుసుపు, కుంకుమ అలంకారం నిర్వహించారు. ఆలయ సిబ్బంది గోపి, పంబల్ మణి, గోపీనాథ్, దాము, వసంతమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎంపీడీవో సమీక్ష

గుడిపాల, మే 16 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం పంచాయతీ పనులపై ఎంపీడీవో శిరీష శుక్రవారం సమీక్షించారు. రూ.75లక్షలతో జరుగుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, మూడు తాగునీటి బోర్లు, సీసీ రోడ్లు, వంతెన అభివృద్ధి తదితరాలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఉపసర్పంచ్ సరళ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, కార్యదర్శి ముత్తుకుమార్, వార్డుమెంబర్లు కళావతి, మల్లిక, దుర్వాసులు,సత్య పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), మే 16(ఆంధ్రజ్యోతి): పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి శుక్రవారం కాణిపాకం వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్ మృతి


గురుస్వామి (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): హెల్త్ సూపర్‌వైజర్ గురుస్వామి(44) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. ఈయన కార్వేటినగరంలో నివాసం ఉంటున్నారు. తిరుపతి జిల్లా దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్నాడు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు



వెదురుకుప్పం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రభుత్వ స్థలం.. ఇందులో ఎవరైనా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవంటూ వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు 221లో 0.77 సెంట్ల భూమికి శుక్రవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు బోర్డు పెట్టారు.

వైసీపీ సీనియర్ నేతకు నివాళి

శ్రీరంగరాజపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్ట దళితవాడకు చెందిన వైసీపీ సీనియర్ నేత సంపంగి(50)కి అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి శుక్రవారం సంపంగి మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. సర్పంచ్ డి.వి.డిల్లెయ్య, మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, మాజీ సర్పంచ్ విజయబాబు, రిటైర్డ్ హెచ్ఎం దొరస్వామి, ఏసురత్నం, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమలు పెరగకుండా చూసుకోండి: అడిషనల్ డీఎంహెచ్‌వో


ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్

చిత్తూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): దోమలు పెరగకుండా చూసుకోవాలని లేదంటే డెంగ్యూ వ్యాధికి కారణమవుతాయని అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీ చవటపల్లె యూపీహెచ్‌సీలో జాతీయ డెంగ్యూ దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జ్వరం, కీళ్ల నొప్పులు, కంటి గుడ్డులో విపరీతమైన నొప్పి, నీరసం, వాంతులు, కడుపునొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే డెంగ్యూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలని చెప్పారు. డీఎంవో వేణుగోపాల్, ఎంహెచ్‌వో లోకేష్ పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌కృష్ణ, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లె: మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారి ప్రియాంక, సిబ్బంది సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, శ్రీహరి, మణి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నగరి: పుదుపేట పీహెచ్‌సీ డాక్టర్లు బిందు, శివముని ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపాల: మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారి సంధ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి బాలసూర్యనారాయణ, సూపర్‌వైజర్ విజయ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో జరిగిన ర్యాలీలో పీహెచ్‌సీ డాక్టర్ భువనేశ్వరి, పీహెచ్ఎన్ గౌరి, ఆరోగ్య పర్యవేక్షకులు త్యాగు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ● ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీ నుంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పీహెచ్ఎన్ చంద్రకళ, హెల్త్ అసిస్టెంటు శ్రీనివాసులు, సూపర్‌వైజర్ గంగాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విత్తన శుద్ధిపై అవగాహన

చిత్తూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లెలో ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ బీఎస్సీ విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా విత్తన శుద్ధి ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బీఎన్ఆర్ పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు జరిగింది. డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ హెడ్ శైలజ, పీఆర్ ప్రశాంతి పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో వర్షం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెదురుకుప్పం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎండ తాకిడికి ఉక్కపోతతో శుక్రవారం జనం అల్లాడిపోయారు. సాయంత్రం వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వెదురుకుప్పం మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ● కార్వేటినగరం మండలంలోనూ శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది.

కారు బోల్తా



గుడిపాల, మే 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో నంగమంగళం న్యూకాలనీ వద్ద శుక్రవారం ఉదయం డివైడర్‌ను ఢీకొని ఓ కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చెన్నైకి చెందిన నలుగురు వ్యక్తులు ఎలాంటి గాయాల్లేకుండా బయటపడ్డారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గంగ జాతర



గుడిపాల, మే 16 (ఆంధ్రజ్యోతి): 197 రామాపురంలో గంగజాతరను గ్రామస్తులు శుక్రవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రాత్రి పురవీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ జనార్ధన్‌నాయుడు, ఆలయ ధర్మకర్త లోకనాథం, టీడీపీ నాయకులు హరిప్రసాద్, మురారిసుధాకర్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అర్జున తపస్సు



నింద్ర, మే 16 (ఆంధ్ర జ్యోతి): అత్తూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా అర్జున తపస్సును శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మానును అధిరోహించారు. విబూది పండ్లు, నిమ్మకాయలు భక్తుల పైకి విసిరారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరిగింది. ఉభయదారులుగా పయణి రెడ్డి, షణ్ముగం రెడ్డి, ఇల్లత్తూరు కలియంబాకం కుటుంబీకులు వ్యవహరించారు.

పంచభూత మహాయాగం

నగరి, మే 16 (ఆంధ్రజ్యోతి): కేవీపీఆర్ పేట పరిధిలోని నందనార్ స్వామి ఆలయంలో పంచభూత మహాయాగాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమం కోసం ఈ యాగం చేసినట్లు నిర్వాహకుడు తిరువయార్ రమేష్‌స్వామి తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.